క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే శంకర్ పేర్కొన్నారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని పద్మారం గ్రామంలో నిర్వహించిన నాభిశిల ప్రతిష్ఠ, వీరన్నపేట గ్రామంలో శివగంగ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో దైవారాధనకు కొంత సమయం కేటాయించాలన్నారు. దైవభక్తితో మానసిక ప్రశాంతత కలుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు రాజు, నాయకులు చంద్రశేఖర్, నర్సింలు, రాములు, భాస్కర్, రజిత, ఆంజనేయులు, వెంకట నర్సింహరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు తొలిమెట్టు అంగన్‌వాడీ కేంద్రం

కొందుర్గు: చిన్నారి విద్య ప్రారంభానికి అంగన్‌వాడీ కేంద్రం తొలిమెట్టు లాంటిదని ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి అన్నారు. గురువారం కొందుర్గు మండలంలోని శ్రీరంగాపూర్, సోమారం పహాడ్, మహదేవ్‌పూర్, చిన్నఎల్కిచర్ల, అయోధ్యాపూర్ తండా, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని పెద్దఎల్కిచర్ల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ నాగమణి హాజరై మాట్లాడారు. మూడేళ్లు నిండిన చిన్నారులను విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ నుంచి బడిలో చేర్పించేందుకు సంసిద్ధంగా తయారు చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా గర్భిణి, బాలింతలకు ప్రభుత్వం అందించే సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కల సంరక్షణ తప్పనిసరి

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: వేసవి కాలం దృష్ట్యా నర్సరీల్లో తప్పనిసరిగా మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తక్కళ్లపల్లి, తక్కళ్లపల్లితండా, నక్కర్తమేడిపల్లి తదితర గ్రామాల్లోని నర్సరీల్లో గురువారం మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు క్రమం తప్పకుండా నీళ్లు పట్టించాలని సిబ్బందికి సూచించారు. వర్షాలు కురిసే లోపు అన్ని గ్రామాల్లో గుంతలు తీసి సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పంచాయతీలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు.

తాగునీటి సమస్యపై చర్యలు తీసుకోండి

నందిగామ: వేసవిని దృష్టిలో పెట్టుకొని మండల ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ప్రియాంక సూచించారు. మండల సర్వసభ్య సమావేశం మండల కేంద్రం నందిగామలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఎంపీపీ ప్రియాంక అధ్యక్షతన నిర్వహించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున కేవలం విద్యుత్, తాగునీటి సమస్యలపై మాత్రమే చర్చ సాగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక అధికారులు జాగ్రత్తగా ఉండాలని, గ్రామాల్లో విద్యుత్, తాగునీటి సమస్య ఏర్పడితే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పైపులైన్ల లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా అయ్యేలా చూడాలన్నారు. అలాగే, బోరు మోటార్లు రిపేరు వస్తే వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. సర్పంచుల పదవీ కాలం పూర్తయిన తర్వాత నిర్వహించే ఈ సమావేశంలో ప్రత్యేకాధికారులు హాజరు కావడం సంతోషకరమన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మంజుల, ఎంపీటీసీలు కలమ్మ, కోఆప్షన్ సభ్యుడు బేగ్, ఎంపీడీఓ సుమతి, తహసీల్దార్ రాజేశ్వర్, ప్రత్యేకాధికారులు, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా అనంతరెడ్డి నామినేషన్

మొయినాబాద్: చేవెళ్ల ఎంపీ స్థానానికి పెద్దమంగళారం గ్రామానికి చెందిన కొంపల్లి అనంతరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు వేశారు. చివరి రోజు గురువారం ఆయన రాజేంద్రనగర్‌లోని ఆర్‌డీఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆయన వెనక పెద్దమంగళారానికి చెందిన నాయకులు మండడి వెంకట్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నర్సింహ్మారెడ్డి, సత్తిరెడ్డి త దితరులు ఉన్నారు. కొంపల్లి అనంతరెడ్డి గతంలో మొయినాబాద్ జెడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశారు. కొంతకాలం టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. 2014లో టీడీపీ నుంచి టీఆర్‌ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి టీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లోనే ఉన్న అయన గురువారం ఆకస్మాత్తుగా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే బీఆర్‌ఎస్ పెద్దల సూచనతోనే ఆయన నామినేషన్ వేసినట్లు ప్రచారం జరుగుతుంది.

తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

- ఆ దిశగా చర్యలు చేపట్టాలి
- మండల ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్
- సాదాసీదాగా సర్వసభ్య సమావేశం
- ఏడుగురు సభ్యుల గైర్హాజరు, గంటలోనే ముగించిన వైనం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్

మహేశ్వరం: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని మండల ఇన్‌చార్జి ఎంపీపీ కె.సునీతానాయక్ పేర్కొన్నారు. మహేశ్వరం ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మండలంలోని ప్రతీ గ్రామంలో తాగునీటి సరఫరాకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. గ్రామ ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో ప్రతిరోజు కృష్ణాజలాలను సరఫరా చేస్తున్నామన్నారు.

సకాలంలో రాని ఆర్టీసీ బస్సులు..

గ్రామాలకు ఆర్టీసీ బస్సులు సకాలంలో రావడం లేదని సభ్యులు సభ దృష్టికి తేవడంతో మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్ మాట్లాడుతూ.. ఉన్న ఆర్టీసీ బస్సులను సకాలంలో నడిపిస్తున్నామని.. త్వరలో కొత్త బస్సులు వస్తాయని రాగానే గ్రామాల్లో సర్వీసులు పెంచుతామన్నారు. ఇలా స్థానిక సమస్యలను సభ్యులు ఏకరవు పెట్టారు. కాగా సర్వసభ్య సమావేశానికి మొత్తం 12 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను ఎంపీపీతో సహా నలుగురు బీజేపీ ఎంపీటీసీ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఏడుమంది (ఒకరు బీజేపీ, ఆరుగురు బీఆర్‌ఎస్) ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. ఎన్నికల కోడ్ ఉండటంతో సర్వసభ్య సమావేశం సాదాసీదాగా నడిచింది. సభను గంట లోపే ముగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజ, పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్, ఎంపీటీసీ సభ్యులు.. సుదర్శన్ యాదవ్, అనురాధ, అనితానాయక్, రామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆ హోటళ్లపై చర్యలు తీసుకుంటాం

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్


నోటీసులు అందజేస్తున్న మున్సిపల్ అధికారులు

మహేశ్వరం: పరిశుభ్రత, నాణ్యత పాటించని హోటళ్లపై జరిమానా విధించి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ బి. వెంకట్రామ్ పేర్కొన్నారు. గురువారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీశైలం జాతీయ రహదారి పక్కనున్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లపై మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పరిశుభ్రత పాటించని హోటళ్లకు నోటీసులు జారీ చేసి, జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుక్కుగూడలో శ్రీశైలం జాతీయ రహదారి పక్కన ఉన్న పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో పరిశుభ్రత పాటించడం లేదన్నారు. వినియోగదారుల నుంచి తమకు పలు ఫిర్యాదులు అందాయన్నారు. కొన్ని హోటళ్లలో పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పురుగులు పడిన ఆహారం, నాణ్యతలేని నూనెలు, వంట సామగ్రితో వండి వినియోగదారులకు పెడుతున్నారన్నారు. మరోమారు ఇలా జరిగితే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు పరిశుభ్రత పాటించని, వృత్తి వ్యాపార లైసెన్స్, లేబర్ లైసెన్స్, ఫుడ్ లైసెన్స్ లేకుండా మాంసహారం ఫ్రిజ్‌ల్లో నిల్వ ఉంచి వాడుతున్న హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు.

కాంగ్రెస్ నేతల ఇంటింటి ప్రచారం


ప్రచారం చేస్తున్న మాజీ కార్పొరేటర్ అనిత, కాంగ్రెస్ నాయకులు

హుడాకాంప్లెక్స్: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనిత దయాకర్‌రెడ్డి గురువారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్, శంకర్‌నగర్, జైస్వాల్‌కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయని, చేవెళ్లలో రంజిత్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్లను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ప్రచారంలో నాయకులు బేర బాలకిషన్, ఆకుల అరవింద్, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, బండి మధుసూదన్, సుదర్శన్ ముదిరాజ్, ఇమ్రాన్ నయీమ్, అరుణ, నాగమణి, రంజిత్, రాఘవేంద్రగుప్తా, కందుల రాము, భాగ్యమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

సీసీఎస్ బకాయిల విడుదలపై హర్షం

వనస్థలిపురం: ఆర్‌టీసీ కార్మికుల సీసీఎస్ బకాయిల నిమిత్తం ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేయడాన్ని ఆర్‌టీసీ ఎంప్లాయిస్ యూనియన్ స్వాగతిస్తోందని యూనియన్ అధ్యక్షకార్యదర్శులు ఎస్. బాబు, వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. సర్వీసులో ఉన్న ఉద్యోగులు అనేకమంది రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారని, నిధు ల లేమి కారణంగా సీసీఎస్ రుణాలు ఇవ్వలేకపోయిందని అన్నారు. ప్రభుత్వం నుంచి ఇంకా రూ. 1000 కోట్లు రావలసి ఉందని అన్నారు. రిటైరైన ఉద్యోగులు వారి సెటిల్‌మెంట్ డబ్బును సీసీఎస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకున్నారని, గత 7 నెలలుగా డిపాజిట్లపై వడ్డీ అందకపోవడం వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విడుదల చేసిన డబ్బులో రిటైరైన ఉద్యోగులకు రావాల్సిన వడ్డీ డబ్బులను వారికి జమ చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డుషోకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

ఇబ్రహీంపట్నం రూరల్: భువనగిరి లోక్‌సభ అభ్యర్థి క్యామ మల్లేశ్ ప్రచారంలో భాగంగా గురువారం బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ రోడ్డుషోకు ఇబ్రహీంపట్నం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రతీ బూత్ నుంచి 20 మంది చొప్పున 5,000 మంది కార్యకర్తలు తరలివెళ్లారు. మల్లేశ్‌కు మద్దతుగా ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్ ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద కాన్వాయ్‌కి మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల, మున్సిపాలిటీల పార్టీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు, రైతు సహకార సంఘం చైర్మ న్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డి గెలుపు కోసం కృషి


కందుకూరులో కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ తదితరులు

కందుకూరు: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని జెడ్పీటీసీ, పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి బొక్క జంగారెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజల మధ్య ఉండి పేద ప్రజల అభివృద్ధికి కృషి చేస్తూ పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, పేదల మదిలో సుస్థిర స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నాడని అన్నారు. రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాజాప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణ, కృష్ణరాంభూపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఈశ్వర్‌గౌడ్, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, సదానంద్‌గౌడ్, యాదయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, గణేష్‌నాయక్, వీరారెడ్డి, బలరామ్, నర్సింహా, ప్రశాంత్‌రెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో కేవీఆర్ గెలుపు ఖాయం

కొండా సంగీత రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించబోతున్నారని ఆయన సతీమణి సంగీతారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆర్‌కే పురం, టెలిఫోన్ కాలనీలో ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరేంద్రమోదీని, కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించుకోవాలని ప్రజలు నిర్ణయించుకున్నారని చెప్పారు. విశ్వేశ్వర్‌రెడ్డి తన వ్యాపారాలన్నీ వదిలిపెట్టుకొని ప్రజాసేవ కోసం ముందుకు వచ్చిన మంచి మనిషి అని ప్రజల కీర్తించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. మోదీ ఉన్నతమైన ఆర్థిక విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని సంగీతారెడ్డి చెప్పారు. ఈ ప్రచారంలో నేతలు అందాల శ్రీరాములు, రాధా ధీరజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌కేపురంలో ప్రచారంలో పాల్గొన్న కొండా సంగీతరెడ్డి

మేడేను విజయవంతం చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దత్తునాయక్


మే డే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దత్తునాయక్ తదితరులు

మహేశ్వరం: కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ కార్మిక సంఘం నిరంతరం పోరాడుతోందని ఏఐటీసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దత్తు నాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మంఖాల్ పారిశ్రామికవాడలో కార్మికులతో కలిసి 138వ మే డే దినోత్సవం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మే డే ఉత్సవాల్లో ప్రతి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ అలుపెరుగని పోరు చేస్తుందన్నారు. పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నరేంద్రమోదీ రద్దు చేసి కార్మికుల పొట్టకొట్టారన్నారు. నరేంద్రమోదీ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్నారన్నారు. ప్రతి కార్మికుడు సంఘటితంగా పోరాడి హక్కులు సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు దేవేందర్, యాదగిరి, లాలూ, సురేష్, సాయికిషోర్, కృష్ణవేణి, స్వప్న, సుజాత, రాణి పలువురు కార్మికులు పాల్గొన్నారు.

మనోజ్‌కుమార్‌రెడ్డికి డాక్టరేట్

మొయినాబాద్‌రూరల్: పరిశోధనలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని హిమాయత్‌నగర్ సమీపంలో గల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో మనోజ్‌కుమార్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు. యూనివర్సిటీలో సూక్ష్మ జీవశాస్త్ర విభాగంలో ఎక్స్‌ప్లోరేషన్ ఆఫ్ కౌంటర్ యాక్షన్ మెకానిజమ్స్ అపార్ట్‌పై, మైక్రో ఆర్గనిజం ఆన్ ఎక్స్‌ప్లోజర్ సిందాసిస్ కంపౌండ్స్ అనే అంశంపై ప్రొఫెసర్ డి.ఎస్.అనురాధ పర్యవేక్షణలో మనోజ్‌కుమార్‌రెడ్డి పరిశోధన చేశారు. ఈ సందర్భంగా చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి అభినందించి డాక్టరేట్ అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ ఆచర్య, రవీందర్, ప్రొఫెసర్ జగదీశ్వర్, రిసర్చ్ డీన్ కిష్టఫర్, సుందర్‌రామ్, ప్రొఫెసర్ ఏ.రాజు, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదె రాంబాబు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

ఎంపీడీఓ బాలశంకర్


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాల శంకర్

మంచాల: గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను కొలతల ప్రకారం చేయాలని మంచాల ఎంపీడీఓ బాల శంకర్ పేర్కొన్నారు. గురువారం ఆరుట్ల గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. కూలీలు ప్రభుత్వం కల్పించిన నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేసినప్పుడే దినసరి కూలి పడుతుందన్నారు. ఎండలో పనులు చేసే సమయంలో వడదెబ్బకు గురి గాకుండా నీడలో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఉపాధిహామీ కూలీకి పని కల్పించే విధంగా చూడాలన్నారు. ఆరుట్ల గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి గ్రామ పంచాయతీ సిబ్బందితో మాట్లాడారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.

మలేరియా నివారణే లక్ష్యం


ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


మలేరియా నివారణకు అవగాహన ర్యాలీ

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ధరణికుమార్

ఇబ్రహీంపట్నం రూరల్: దోమలను నివారించడం ద్వారానే మలేరియాను నివారించవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ధరణికుమార్ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ధరణికుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణ లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని కోరారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రతను పాటించాలని అప్పుడే దోమల నివారణ తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మమత, కీర్తన, గోపాల్‌రెడ్డి, హేమాలాల్, సూపర్‌వైజర్ చంద్రశేఖర్, వయోలాతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మాడ్గుల: మలేరియా నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని మాడ్గుల మండల ప్రాథమిక ఆరోగ్యా కేంద్రం డాక్టర్ మోహన్ అన్నారు. బుధవారం మాడ్గుల మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చలితో కూడిన జ్వరం, తలనొప్పి ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలాన్నారు. దోమలు వృద్ధి చెంద కుండా పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ దయాకర్, ల్యాబ్ టెక్నీషియస్ మనోహర్ రెడ్డి, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొలను ఇలా.. ఈత కొట్టేదెలా!

- కోట్లాది రూపాయలతో స్విమ్మింగ్‌పూల్స్ నిర్మాణం
- వేసవి సెలవులు వచ్చినా తెరచుకోని వైనం
- నీటి కొరతే కారణమంటున్న అధికారులు
- విద్యార్థులు, యువతలో నిరుత్సాహం


నిరుపయోగంగా ఉన్న వనస్థలిపురం ఫేజ్–4లోని స్విమ్మింగ్‌పూల్

వనస్థలిపురం: ఈత కొలనులు ఉన్నాయి. కానీ, వాటిల్లో నీళ్లే లేవు. ఫలితంగా అవి నిరుపయోగంగా, అలంకారప్రాయంగా ఉన్నాయి. పాఠశాలలు, విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో స్విమ్మింగ్ నేర్చుకోవడానికి ఉత్సాహం చూపిస్తుంటారు. అయితే వనస్థలిపురం, బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని సచివాలయ నగర్‌లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నడిచే స్విమ్మింగ్ పూల్స్ నిరుపయోగంగా ఉన్నాయి. మరోవైపు ప్రైవేటు స్విమ్మింగ్ పూల్స్‌లో ఫీజులు అధికంగా ఉండటంతో వాటి వైపు వెళ్లడానికి చాలామంది ఆసక్తి చూపడంలేదు. ఎక్కువగా జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్‌పూల్స్‌ను ఆశ్రయిస్తుంటారు. కానీ అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణాలోపంతో జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్‌పూల్స్ ఏప్రిల్ నెల ముగుస్తున్నా ఇంకా తెరచుకో లేదు. దీంతో ఈత కొట్టేదెలా.. అని విద్యార్థులు, యువత నిరుత్సాహానికి గురవుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం...

హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో రూ.1.50 కోట్లతో వనస్థలిపురం ఫేజ్–4లో స్విమ్మింగ్‌పూల్ నిర్మించారు. 2022 సంవత్సరం డిసెంబర్ 6న అప్పటిమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దానిని ప్రారంభించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్‌లో రూ. 3 కోట్లకుపైగా వ్యయంతో మరో స్విమ్మింగ్‌పూల్ ప్రారంభమైంది. అనంతరం వీటి నిర్వహణ బాధ్యతలు జీహెచ్‌ఎంసీకి అప్పగించారు. గత ఏడాది ఈ పాటికి తెరచుకొన్న ఈత కొలనులు, ఈ సంవత్సరం ఏప్రిల్ నెల ముగుస్తున్నా తెరచుకోకపోవడంతో విద్యార్థులు, యువత నిరుత్సాహానికి గురవుతున్నారు. వనస్థలిపురం, పరిసర ప్రాంతాల ప్రజలకు ఈత కొలనులు అందుబాటులోకి వచ్చాయని ఆనందించేలోపే అవి నిరుపయోగంగా మారుతున్నాయని, సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్‌లో మూసివేసి ఉన్న స్విమ్మింగ్ పూల్

త్వరగా అందుబాటులోకి తెస్తాం

సచివాలయనగర్‌లో ఉన్న స్విమ్మింగ్‌పూల్‌కు సంబంధించి రెండు బోర్లు ఎండిపోవడంతో నీటి సమస్య వచ్చింది. స్విమ్మింగ్‌పూల్‌ను నీటితో నింపడానికి వాటర్ ట్యాంకర్లు తెప్పించడానికి పైనుంచి అనుమతులు వచ్చాయి. త్వరలో పూల్‌ను అందుబాటులోకి తెస్తాం. వనస్థలిపురం ఫేజ్–4లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను మరో 3, 4 రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

– వెంకటరెడ్డి, స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్, జీహెచ్‌ఎంసీ